

సోమశిలలో 61.751 టీఎంసీలు

సోమశిల: జలాశయంలో సోమవారం సాయంత్రానికి 61.751 టీఎంసీలు ఉన్నాయి. 124 క్యూసెక్కుల ప్రవాహం వస్తోంది. పెన్నార్‌డెల్టాకు 2000, ఉత్తర కాలువకు 703, దక్షిణకాలువకు 400, కండలేరుకు 50 క్యూసెక్కులు విడుదల చేస్తున్నారు.



బంగారం ధరలు

24 క్యారెట్లు (10 గ్రా)	రూ.57,420
22 క్యారెట్లు ఆర్నమెంట్ (1 గ్రా)	రూ.5,129
3 శాతం జీఎస్టీతో	రూ.5,283
నవర (8గ్రా)	రూ.42,264

వాతావరణం

గరిష్టం/కనిష్టం
32.9 /22.9

జిల్లాలో గత రెండు రోజులుగా పగటి ఉష్ణోగ్రతలు తగ్గుముఖం పట్టాయి. రాత్రి ఉష్ణోగ్రతలు సాధారణంగా ఉన్నాయి. గాలిలో తేమ 52 శాతం ఉంది.

న్యూస్‌రీల్

ఎమ్మెల్సీగా మేరిగ మురళీ ఏకగ్రీవ ఎన్నిక

- ధ్రువీకరణపత్రం అందజేసిన ఎన్నికల అధికారి



ఎన్నికల రిటర్నింగ్ అధికారి, జేసీ కూర్మనాథ్ నుంచి ఎమ్మెల్సీగా ఎన్నికైనట్లు ధ్రువీకరణ పత్రాన్ని అందుకుంటున్న మేరిగ మురళీధర్

నెల్లూరు (అర్బన్): స్థానిక సంస్థల ఎమ్మెల్సీగా వైఎస్సార్‌సీపీ అభ్యర్థి మేరిగ మురళీధర్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఈ మేరకు ఎన్నికల రిటర్నింగ్ అధికారి, జేసీ కూర్మనాథ్ ధ్రువీకరణ పత్రాన్ని సోమవారం మేరిగ మురళీధర్‌కు అందజేశారు. స్థానిక సంస్థల ఎమ్మెల్సీ స్థానానికి మేరిగతో పాటు ఒక ఇండిపెండెంట్ అభ్యర్థి నామినేషన్ దాఖలు చేశారు. ఇండిపెండెంట్ అభ్యర్థి తగిన ధ్రువపత్రాలు సమర్పించకపోవడంతో ఆయన నామినేషన్ తిరస్కరణకు గురైన విషయం తెలిసిందే. మేరిగ మురళీధర్ రాపూరులో 1969 మే 23న జన్మించారు. ప్రాథమిక విద్య రాపూరులోని ఎస్‌పీఎల్‌సీ మిషనరీ చర్చి స్కూల్లో సాగింది. ఇంటర్మీడియట్ వరకు రాపూరులో సీవీకే గవర్నమెంట్ జూనియర్ కళాశాలలో, డిగ్రీ అక్కడే ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో చదివారు. వెంకటేశ్వర యూనివర్సిటీలో రాజనీతి శాస్త్రంలో పీజీ పూర్తి చేశారు. 1984లో కాంగ్రెస్ పార్టీ తరఫున ఎంపీ అభ్యర్థిగా పోటీ చేశారు. వివాద రహితుడిగా ఉంటూ 1986 నుంచి స్టూడెంట్ లీడర్‌గా కొనసాగారు. 1995లో రాపూరు జెడ్పీటీసీ కాంగ్రెస్ అభ్యర్థిగా ఘన విజయం సాధించారు. 2013 నుంచి 2014 వరకు ఉమ్మడి నెల్లూరు జిల్లా వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడిగా, 2016 నుంచి 2019 వరకు గూడూరు వైఎస్సార్‌సీపీ ఇన్‌చార్జిగా, 2021లో రాష్ట్ర ఫైనాన్స్ కార్పొరేషన్ చైర్మన్‌గా పదవులను అలంకరించారు.

ప్రాక్టికల్స్‌కు 235 మంది గైర్హాజరు



లైవ్ స్ట్రీమింగ్ ద్వారా కేంద్రాలను పరిశీలిస్తున్న ఆర్‌ఐఓ వరప్రసాదరావు

నెల్లూరు (టౌన్): ఇంటర్మీడియట్ ప్రాక్టికల్స్ పరీక్షలకు సోమవారం జిల్లా వ్యాప్తంగా మొత్తం 235 మంది విద్యార్థులు గైర్హాజరయ్యారు. ఉదయం జరిగిన ప్రాక్టికల్స్ జనరల్‌కు సంబంధించి 4,244 మంది హాజరుకావాల్సి ఉండగా 4,151 మంది హాజరయ్యారు. 93 మంది గైర్హాజరయ్యారు. ఒకేషనల్‌కు సంబంధించి 790 మందికి 747 మంది విద్యార్థులు హాజరు కాగా, 43 మంది గైర్హాజరయ్యారు. మధ్యాహ్నం నుంచి జరిగిన ప్రాక్టికల్స్ జనరల్‌కు సంబంధించి 3,518 మందికి 3,459 మంది హాజరయ్యారు. 59 మంది గైర్హాజరయ్యారు. ఒకేషనల్‌కు సంబంధించి 765 మందికి 725 మంది హాజరు కాగా 40 మంది గైర్హాజరయ్యారు. జిల్లా అబ్జర్వరు సుధాకర్, ఆర్‌ఐఓ వరప్రసాదరావు, డీవీఈఓ మధుబాబు, హైపవర్ కమిటీ సభ్యులతో పాటు ఫ్లయింగ్ స్క్వాడ్ అధికారులు పలు కేంద్రాలను తనిఖీ చేశారు.

కాలువ వద్ద కోననీటిని బిందెల్లో నింపుకుంటున్న పట్టణవాసులు



అమృత జలం

ప్రకృతి సహజ సిద్ధంగా అనేక ఖనిజాలతో కూడి బావులు, బోర్లలో లభించే నీటిని తాగడం జనం మానేశారు. మినరల్ వాటర్ పేరుతో రివర్స్ ఆస్మోసిస్ విధానంలో మలినాలను తొలగించే క్రమంలో అవసరమైన మినరల్స్ లేని గరళ జలాన్ని తాగుతున్నారు. అయితే ఉదయగిరి పట్టణ ప్రజలు ప్రకృతి ప్రసాదినిగా లభించే కోన నీటి కోసం ఎగబడుతున్నారు. కొండ కోనల నుంచి ప్రవహించే కాలువ వద్దకు వెళ్లి బిందెడు నీటిని పట్టుకుని గ్లాసు నీటిని తాగితే కాని వారి దిన చర్య ప్రారంభం కాదు. ఈ అమృత జలం కోసం వేకువ జాము నుంచే బిందెలు పట్టుకుని బారులు తీరుతారు.



కాలువ ద్వారా పట్టణంలోకి పారుతున్న కోన నీరు

- వనమూలికల నెలవు ఉదయగిరి దుర్గం
- ఔషధ గుణాలతో మిళితమై మూడు కి.మీ. ప్రవహిస్తున్న నీరు
- ఆ నీటిని ఒడిసి పట్టుకుంటున్న స్థానికులు
- ప్రకృతి ప్రసాదిని కోన నీరు

సాక్షి ప్రతినిధి, నెల్లూరు: అవి అమృతం కంటే అపర సంజీవని జలం. ప్రకృతి సిద్ధంగా పెరిగే వనమూలికలు, ఆకుల్లోని ఎన్నో ఔషధ గుణాలను మిళితం చేసుకుని పారుతున్న కోన నీటిని ఒడిసి పట్టుకునేందుకు ఉదయగిరి ప్రజలు వేకువకు ముందే క్యూ కట్టుతారు. దొరికే ప్రతి నీటిబొట్టును అమృతభాండంగా భావిస్తారు. కోడి కూయక ముందే నిద్రలేచిన మహిళలు చంకన బిందె పట్టి నీటి కోసం వెళ్తారు. ఆ నీరు గొంతులో పడితే అమృతం తాగినట్లేనంటున్నారు. ఆ నీటిలో ఉన్న ఔషధ గుణాలు పోకుండా జాగ్రత్తలు తీసుకుంటారు. ఈ నీటిని తాగడం ద్వారా దీర్ఘకాలిక రోగాలే కాదు.. సీజనల్‌గా వచ్చే వ్యాధులు కూడా రావనేది స్థానిక ప్రజల విశ్వాసమే కాదు వాస్తవం కూడా.

నీటిని ఒడిసి పట్టేందుకు..

ఉదయగిరి పట్టణం ఒకప్పుడు తీవ్ర తాగునీటి ఎద్దడిని ఎదుర్కొనేది. సుమారు 8 వేల కుటుంబాలు, 18 వేల మందికిపైగా జనాభా కలిగిన ఉదయగిరి ప్రజల దాహార్తి తీర్చేందుకు అప్పటి ప్రభువులు, దుర్గంపై కోనపై భాగాన కొండ వాగుకు అడ్డంగా తొట్టి నిర్మించారు. అక్కడి నుంచి కొంత పైభాగం వరకు కొండరాళ్లను ఆనించి కాలువ నిర్మించి వాగునీటిని తొట్టిలోకి మళ్లించారు. ఈ తొట్టె నుంచి కోననీరు పట్టణానికి చేరుకునేందుకు మూడు కిలో మీటర్ల దూరం వరకు కాలువను నిర్మించారు. మార్గమధ్యంలో నాలుగు చోట్ల వంతెనలు కూడా రూపొందించి కాలువను ఏర్పాటు చేశారు. మూడు శతాబ్దాల క్రితం దుర్గం నవాబుల ఏలుబడిలో ఉన్నప్పుడు ఈ కోన కాలువ నిర్మాణం చేపట్టినట్లు తెలుస్తోంది. అప్పటి నుంచి కొన్ని దశాబ్దాల వరకు దుర్గం నుంచి ఉదయగిరి పట్టణం మీదుగా రాజ ప్రసాదంగా ఉన్న ఫారెస్ట్ బంగ్లా వరకు కోన నీరు అంతర్గత కాలువ ద్వారా ప్రవహించేది. రాజ ప్రసాదంలో నివాసముంటున్న నవాబులు, వారి కుటుంబ పరివారం ఈ నీటినే వాడుకునే వారని చరిత్ర చెబుతోంది. ఆ నాడు మూడు.. నాలుగు తొట్లు ఉండేవి. ఈ తొట్ల నుంచి పట్టణ ప్రజలు కోన నీటిని తోడుకునేవారు. ప్రస్తుతం కోననీరు పట్టణంలోని సీతారామపురం రోడ్డు వరకు మాత్రమే ప్రవహిస్తోంది. ఈ కాలువలో నీరు నిరంతరం ప్రవహిస్తుండడంతో వేలాది మంది పట్టణ ప్రజలు దాహం తీరుస్తోంది. ఒక పూట అన్నం లేకుండా ఉండగలరేమో కానీ ఈ నీరు తాగకుండా బతకలేమని ఇక్కడి ప్రజలు గర్వంగా చెప్పుకుంటున్నారు. కోన నీరు పట్టణానికి సుదూరంలో ఉన్నా ప్రజలు శ్రమకోర్చి ఒకటి రెండు బిందెలు తెచ్చుకుని తాగేవారు. కొంత మంది తమ వాహనాల్లో కోననీరు తెచ్చుకుంటుంటారు. ఈ నీటితో దుర్గం అడవిలో జీవిస్తున్న అడవి జంతువులు, పక్షులు దాహార్తిని తీర్చుకుంటున్నాయి. ఉదయగిరి గ్రామ పంచాయతీ నిర్వహణలో కోన కాలువను తరచూ లక్షలాది రూపాయలు వెచ్చించి మరమ్మతులు చేస్తుంటారు. కాలువలో నీటి ప్రవాహం తగ్గకుండా తాగునీటి సమస్య తలెత్తకుండా చర్యలు తీసుకుంటున్నారు.

కోననీటి ప్రాముఖ్యత

ఉదయగిరి దుర్గంపై కొండ కోనల్లో ఎన్నో ఔషధ గుణాలు ఉన్న రకాల వనమూలికల మొక్కలు ఉన్నాయి. రెండు కొండల నడుమ లోయను కోన కాలువగా పిలుస్తారు. కోనపై నుంచి ప్రకృతి సిద్ధంగా ఉబికి వచ్చే నీరు దిగువ ఉదయగిరి పట్టణం వరకు మూడు కిలోమీటర్ల దూరం ప్రవహిస్తోంది. ఆ నీటిని ఒడిసి పట్టేందుకు ప్రత్యేకంగా కాలువను ఏర్పాటు చేశారు. ఔషధ గుణాలు కలిగిన వనమూలికలను తాకుతూ ప్రవహిస్తుండడంతో ఆ నీటిలో సహజ సిద్ధమైన ఔషధగుణాలే కాకుండా, అనేక మినరల్స్ ఉండడంతో ఎంతో ప్రీతి పాత్రంగా భావిస్తారు.

కోననీరు అమృతం లాంటివి



దుర్గంపై నుంచి వచ్చే కోన నీరు అమృతం లాంటివి. మేము కొంత దూరం నడచి వెళ్లి రెండు బిందెల నీటిని తెచ్చుకుని వాడుకుంటాం. ఈ నీరు చాలా చల్లదనంగా ఉంటాయి. కోననీరు తాగితే ఎలాంటి జబ్బులు రావడం లేదు. వివిధ రకాల వనమూలికల చెట్లను తాకుతూ ప్రవహిస్తుంటాయి. ఈ నీటిని మా తల్లిదండ్రుల కాలం నుంచి తాగుతున్నాం. ఇదే నీటితో అన్నం ఎసరుకు పెట్టుకుట్టాం. గతంలో కోననీటి కోసం మూడు కిలో మీటర్ల దూరంలోని తొట్టి వద్దకు వెళ్లి తెచ్చుకున్న సందర్భాలు ఉన్నాయి.

– మంకాల వెంకటగురుప్రసాద్, మంగలికట్ట, ఉదయగిరి

ఆరోగ్య ప్రదాయిని



ఉదయగిరి దుర్గంపై నుంచి వచ్చే కోన నీరు ఆరోగ్య ప్రదాయిని. కొండల్లో కాలువ ద్వారా రకరకాల మొక్కల వేళ్లను తాకుతూ ప్రవహిస్తుంటాయి. పట్టణ వాసులు ఈ నీటి కోసం వేకువ జాము నుండే నడక ద్వారా, వాహనాల ద్వారా వెళ్లి బిందెలతో తెచ్చుకుంటుంటారు. బ్రిటిష్ కాలం నుంచి ఈ నీరు ప్రజలకు అందుతూనే ఉన్నాయి. ఉదయగిరి దుర్గం చూసేందుకు వచ్చే పర్యాటకులు కూడా ఈ నీటిని బాటిళ్లలో తీసుకెళ్తుంటారు.

– షేక్ ముర్తూజాహుస్సేన్, ఉపసర్పంచ్, ఉదయగిరి

కోన నీరే తాగుతాం



ఉదయగిరి కొండ కోనల్లోంచి వచ్చే కోననీటికి ప్రాముఖ్యత ఉంది. ఏ కాలంలో అయినా ఈ కోన నీరు స్వచ్ఛంగా చల్లగా ఉంటాయి. ఈ నీటిని ప్రతి రోజు పట్టణ వాసులు ఒక బిందైనా తీసు కెళ్తుంటారు. ఈ నీటిని తాగడం వల్ల ఎలాంటి ఆనారోగ్య సమస్యలు ఉండవు. ఈ నీటిని నవాబులు, రాజుల కాలం నుంచి తాగుతున్నారు. ఎంత కష్టమైనా కోన నీటిని తెచ్చుకుని తాగుతాం.

– షేక్ జిలానీ, ఉదయగిరి

తల్లడిల్లిన తోడేరు

- గల్లంతైన ఆరుగురి మృతదేహాల వెలికితీత
- బాధిత కుటుంబాల్లో ఒక్కరే మగపిల్లలు
- గుండెలవిసేలా రోదిస్తున్న బంధువులు
- గుండెపగిలి ప్రశాంత్ అమ్మమ్మ మృతి

ఎక్కడో చిన్న ఆశ. బిడ్డలంతా క్షేమంగా తీరానికి తిరిగొస్తారని ఊరు ఊరంతా తెల్లవార్లూ ఎదురు చూసింది. తెల్లారేసరికి ఆశలు ఆవిరయ్యాయి. ఒక్కొక్క బిడ్డ శవమై తిరిగిరావడంతో తోడేరు కన్నీటేరైంది. కన్నవారి గుండెలు పగిలేలా రోదించాయి. ఆత్మీయులు, బంధువుల హృదయాలు విలవిలలాడాయి. అందరి కుటుంబాల్లోనూ ఒక్కగానొక్క వంశాంకురాలే. కుటుంబానికి ఆదరువుగా ఉంటారనుకుంటే విధి ఆ తల్లిదండ్రుల ఆశలు చిదిమేసింది.



మృతదేహాన్ని గుర్తించి ఒడ్డుకు తీసుకు వస్తున్న గజ ఈతగాళ్లు

పొదలకూరు: హత.. విధీ. గుండెల్ని పిండేసే విషాదమిది. అందరిదీ ఒకే ఊరు.. చుట్టు పక్కల ఉండే స్నేహితులు. సరదాగా చెరువులో షికారుకెళ్లిన యువకుల్లో గల్లంతైన ఆరుగురు విగతజీవులై దొరికారు. మండలంలోని తోడేరుకు చెందిన పది మంది యువకులు కొత్తచెరువులో నాటు పడవపై విహరించేందుకు వెళ్లడంతో అదుపు తప్పి బోల్తాపడి ఆరుగురు గల్లంతు కాగా, మరో నలుగురు ఈదుకుంటూ బయటపడిన విషయం తెలిసిందే. గల్లంతైనవారు తిరిగొస్తారన్న ఆశలు అడియాశలయ్యాయి. విగత జీవులైన బిడ్డల్ని చూసిన తల్లిదండ్రులు గుండెలవిసేలా రోదించారు. అందరికీ ఒక్కొక్కరే మగ సంతానం కావడం గమనార్హం. దీంతో వారి బాధ వర్ణనాతీతంగా ఉంది. ఆ బాధను తట్టుకోలేక ఓ మృతుడి అమ్మమ్మ గుండె ఆగి మరణించింది.

తోడేరు శోకసంద్రమైంది. ఈ ఊరిలో ఎవరిని కదిలించినా కళ్లు.. కన్నీటి సుడులవుతున్నాయి. మృతులంతా వారంతా పాతికేళ్ల లోపు యువకులే. ఒకరిద్దరు ఉద్యోగాలు చేస్తుంటే.. ఇంకొందరు చదువుకుంటున్నారు. అందరూ ఒకే వీధిలో ఉండే వేర్వేరు సామాజికవర్గాలకు చెందిన స్నేహితులు. కష్టంలోనూ.. సంతోషంలోనూ పాలు పంచుకునే సైన్యంలా ఉండేవారు.

ఆరు కుటుంబాల్లో ఒక్కొక్కరే మగపిల్లలు

అంతులేని విషాదమిది. పడవ ప్రమాదంలో మృతి చెందిన ఆరుగురు ఆయా కుటుంబాల్లోని ఒక్కగానొక్క మగ పిల్లలే. అందరూ పేద వర్గాలకు చెందిన వారే. కాయకష్టం చేసుకుని కుటుంబాలను పోషించుకుంటూ బిడ్డలను వృద్ధిలోకి తీసుకొచ్చేందుకు ఆ తల్లిదండ్రులు అహర్నిశలు శ్రమిస్తున్నారు. ఆదివారం ఆ కుటుంబాల్లో తల్లిదండ్రులకు పుట్టెడు దుఃఖమే మిగిలింది. పది మంది పోగై సరదాగా పడవలో షికారు చేద్దామని వెళ్లారు. వీరిలో విష్ణు, మహేష్, మహేంద్ర, కిరణ్ ఈదుకుంటూ బయటపడిన విషయం తెలిసిందే.

తోడు నీడై ఉంటారనుకుంటే..

ప్రమాదంలో మృతి చెందిన ఆరుగురిలో.. కల్యాణ్‌ది ప్రేమ వివాహం. విరువూరుకు చెందిన మేనమామ కూతుర్ని ప్రేమించి పెద్దలను ఒప్పించి పెళ్లి చేసుకున్నాడు. కల్యాణ్‌కు ఇద్దరు చిన్న పిల్లలు ఉన్నారు. శ్రీనాథ్ ఇంటర్ ద్వితీయ సంవత్సరం చదువుతున్నాడు. తల్లిదండ్రులు వెంకటేశ్వర్లు, శారద వ్యవసాయం చేసుకుని జీవిస్తున్నారు. దిగువ మధ్య తరగతి కుటుంబానికి చెందిన వీరు బిడ్డలను చదివించుకుంటున్నారు. ప్రశాంత్‌కుమార్ ఇన్ఫోసిస్‌లో సాఫ్ట్‌వేర్ ఇంజినీరుగా వర్క్ ఫ్రం హోమ్‌లో పని చేస్తున్నాడు. నెలకు రూ.1.30 లక్షల జీతం. తండ్రి లేని ప్రశాంత్‌కు తల్లి శేషమ్మ, చెల్లి ప్రతిమ ఉన్నారు. బాలాజీ కోవూరు గీతాంజలి ఇంజినీరింగ్ కాలేజీలో తృతీయ సంవత్సరం చదువుతున్నాడు. సుబ్బారావు, మల్లీశ్వరిల కుమారుడైన బాలాజీ ఏకైక సంతానం కావడంతో వారి రోదనలు మిన్నంటాయి. రఘుకు తండ్రి లేడు. తల్లి భావనమ్మ అనారోగ్యంతో బాధపడుతున్న నిరుపేద కుటుంబం. పొదలకూరు కో–ఆపరేటివ్ బ్యాంకులో మెసెంజర్‌గా పనిచేస్తూ తల్లిని పోషిస్తున్నాడు. సురేంద్ర ఇంటర్ ద్వితీయ సంవత్సరం చదువుతున్నాడు. తల్లిదండ్రులు నాగరాజు, మాధవి దిగువ మధ్య తరగతి కుటుంబం. వీరి కుటుంబాల్లో వెలుగులు నింపుతారని, వారి భవిష్యత్‌పై కలలు కంటున్న తల్లిదండ్రుల ఆశల సౌధం కూలిపోయి, చివరకు కన్నీరే మిగిలింది.

హృదయ విదారక దృశ్యాలు

కొత్త చెరువు వద్ద హృదయ విదారక పరిస్థితులు కనిపించాయి. గల్లంతైన తమ బిడ్డలు ఎక్కడో చెట్టో.. పుట్టో తగులుకుని ప్రాణాలతో తిరిగొస్తారనకుంటే ఒక్కొక్క మృతదేహం బయటపడుతుంటే అక్కడే ఉన్న ఊరు జనమంతా విలపించారు. గుండెలు పగిలేలా రోదనలు మిన్నంటాయి. పడవల్లో మృతదేహాలు ఒడ్డుకు చేర్చుతున్న సమయంలో పిల్లల తల్లిదండ్రుల రోదనలు చూసి సహాయక చర్యలు చేపడుతున్న అధికార యంత్రాంగం, జనాలు చలించిపోయారు. ప్రమాద విషయం తెలుసుకున్న మంత్రి కాకాణి హైదరాబాద్ నుంచి హుటాహుటినా ఘటనా స్థలానికి చేరుకున్నారు. అధికార యంత్రాంగాన్ని అప్రమత్తం చేసి గాలింపు చర్యలు చేపట్టేలా చర్యలు తీసుకున్నారు. దీంతో అధికారులు ముత్తుకూరు నుంచి ప్రత్యేకంగా మరబోట్లను తెప్పించి గాలింపు చర్యలు ము మ్మరం చేశారు. మృతుల బంధువులు, స్నేహితులతో చెరువుకు సమీప ప్రాంతం నిండిపోయింది. ఉదయం 11 గంటలకల్లా మన్నూరు కల్యాణ్, అల్లి శ్రీనాథ్, చల్లా ప్రశాంత్‌కుమార్, పముజుల బాలాజీ, బట్ట రఘు మృతదేహాలను వెలికితీయించారు. చివరగా పాటి సురేంద్ర మృతదేహాన్ని వెలికి తీశారు. చెరువులోకి పడవలో షికారుకు వెళ్లిన స్నేహితులు నీటమునిగి పోవడంతో భయంతో ఒకరినొకరు చేతులు పట్టుకుని ప్రా ణాలు విడిచారు. ఆ దృశ్యాలను చూసిన గజ ఈతగాళ్లు సైతం ఆవేదన వ్యక్తం చేశారు. మృతుల్లో కల్యాణ్ కూడా గజ ఈతగాడే.



బాలాజీ (ఫైల్)



రఘు(ఫైల్)



శ్రీనాథ్(ఫైల్)



ప్రశాంత్ (ఫైల్)



సురేంద్ర(ఫైల్)



కల్యాణ్(ఫైల్)

గుండె పగిలి ప్రశాంత్ అమ్మమ్మ మృతి

ప్రశాంత్‌కుమార్ మృతి చెందిన విషయం తెలిసి బుచ్చిరెడ్డిపాళెంలో ఉంటున్న అతని అమ్మమ్మ బైనా రమణమ్మ గుండెపగిలి మరణించడం మరో విషాదం. చిన్నప్పటి నుంచి ప్రశాంత్‌కుమార్ అమ్మమ్మ వద్దే ఉన్నాడు. కొడుకును కోల్పోయి పుట్టెడు దుఃఖంలో ఉన్న శేషమ్మ తల్లిని కూడా కోల్పోవడంతో ఆమె కన్నీరుమున్నీరుగా విలపిస్తోంది.



వెలికి తీసిన రఘు మృతదేహం



కల్యాణ్ మృతదేహం వద్ద రోదిస్తున్న కుటుంబ సభ్యులు



సురేంద్ర మృతదేహం వద్ద రోదిస్తున్న తల్లి







శ్రీనాథ్, ప్రశాంత్‌కుమార్, బాలాజీ మృతదేహాల వద్ద రోదిస్తున్న కుటుంబ సభ్యులు

పడవ ప్రమాదం కలిచివేసింది

- కన్నీరుమున్నీరైన మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి



మాట్లాడుతున్న మంత్రి కాకాణి

పొదలకూరు: తోడేరు కొత్తచెరువులో పడవ ప్రమాదం తనను కలిచి వేసిందని, తన స్వగ్రామం తోడేరుకు చెందిన ఆరుగురు యువకులు ఒక్కసారిగా మృతి చెందడం అత్యంత బాధాకరమని రాష్ట్ర వ్యవసాయశాఖ మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి కన్నీరుమున్నీరయ్యారు. ప్రమాదం విషయం తెలిసిన వెంటనే హైదరాబాద్ నుంచి ఘటనా స్థలానికి మంత్రి తెల్లవారు జామున చేరుకున్నారు. ఈ సందర్భంగా మంత్రి విలేకరులతో మాట్లాడుతూ మృతుల కుటుంబాల వేదన తీర్చలేనిదన్నారు. ఆ కుటుంబాలను అన్ని విధాలుగా ఆదుకుంటానన్నారు. వీరందరూ నా బలమే కాక తన సైన్యమన్నారు. మా ఇంటి చుట్టు పక్కల ఉండే కుటుంబాల్లో విషాదం నెలకొనడం జీర్ణించుకోలేకపోతున్నట్లు తీవ్రభావోద్వేగానికి గురయ్యారు. బాధిత కుటుంబాల్లో ఒక్కరే మగపిల్లలు ఉన్నారని, వారి లోటును ఎవరూ పూడ్చలేరన్నారు. వారి కుటుంబాలకు ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు.

మార్కెట్ సెస్.. రాబడి ఫుల్

కందుకూరు వ్యవసాయ మార్కెట్ కమిటీ రికార్డు సృష్టించింది. వ్యవసాయ ఉత్పత్తుల రవాణాపై మార్కెటింగ్ శాఖ చేసే సెస్ వసూళ్లలో జిల్లాలోనే మొదటి స్థానంలో నిలిచింది. ప్రభుత్వ లక్ష్యానికి మించి వసూళ్లు సాధించింది. ఏఎంసీ పరిధిలో పత్తి పంట ఎక్కువ విస్తీర్ణంలో సాగైంది. ధర బాగుండటంతో అమ్మకాలు, కొనుగోళ్లు పెరిగాయి. దీంతో రికార్డు స్థాయిలో సెస్ రాబడి వచ్చింది.

- కందుకూరు ఏఎంసీ రికార్డు
- ఇప్పటి వరకు రూ.3.39 కోట్ల వసూలు
- జిల్లాలోనే మొదటి స్థానం
- అధిక విస్తీర్ణంలో పత్తి సాగు
- ధరలూ బాగుండటమే అధిక రాబడికి కారణం

ఏఎంసీ కార్యాలయం



కందుకూరు: వ్యవసాయ ఉత్పత్తుల కొనుగోలుదారులపై మార్కెటింగ్ శాఖ ఒక శాతం మేర మార్కెట్ సెస్‌ను వసూలు చేస్తుంది. ప్రతి ఆర్థిక సంవత్సరంలో ఆయా మార్కెట్ యార్డుల పరిధిలోని సగటు ఆదాయం ఆధారంగా ప్రభుత్వం లక్ష్యాన్ని నిర్దేశిస్తుంది. దీనిని చేరుకునేందుకు ఆ శాఖ అధికారులు కసరత్తు చేస్తుంటారు. ఈ విధంగా కందుకూరు వ్యవసాయ మార్కెట్ యార్డు పరిధిలో 2022–23 ఆర్థిక సంవత్సరానికి సెస్ లక్ష్యం రూ.2.30 కోట్లు. కందుకూరు ఏఎంసీ అధికారులు ఈ లక్ష్యాన్ని చేరుకోవడమే కాదు అదనపు రాబడిని కూడా సాధించారు. ఈ ఏడాది ఫిబ్రవరి నాటికే రూ.3.39 కోట్లు వచ్చాయి. ఆర్థిక సంవత్సరం ముగిసేందుకు మార్చి నెలాఖరు వరకు గడువు ఉండటంతో రూ.4 కోట్ల లక్ష్యాన్ని చేరుకుంటామని అధికారులు చెబుతున్నారు. ప్రస్తుతం కందుకూరు యార్డు మార్కెట్ సెస్ వసూళ్లలో జిల్లాలోనే ప్రథమస్థానంలో నిలిచింది. దీంతో ఉన్నతాధికారులు అభినందించారు.

పత్తి సాగు చేయడంతో..

గత వ్యవసాయ సీజన్‌లో ఏఎంసీ పరిధిలో వరికి బదులు రైతులు పత్తి పంటను అధిక విస్తీర్ణంలో సాగు చేశారు. రాళ్లపాడు ప్రాజెక్టు కింద సైతం ఇదే జరిగింది. అధికారుల లెక్కల ప్రచారం సుమారు పదివేల ఎకరాలపైన ఉంటుందని అంచనా. పత్తి క్వింటా రూ.10,000 నుంచి రూ.12,000 వరకు ధర పలికింది. దీంతో సెస్ వసూళ్లు బాగున్నట్లు ఏఎంసీ అధికారులు చెబుతున్నారు. అలాగే సున్నా ఆదాయం ఉన్న ప్రాంతాలను గుర్తించి అదనపు చెక్‌పోస్టులను ఏర్పాటు చేసి నిఘా పెంచారు. దీంతో అధికారులు ఊహించిన దాని కంటే ఎక్కువ మొత్తం ఏఎంసీ నుంచి ప్రభుత్వానికి సమకూరింది.

క్రమంగా పెరుగుతూ..

వాస్తవానికి కేంద్ర ప్రభుత్వం తీసుకొచ్చిన మూడు రైతు చట్టాలతో వ్యవసాయ మార్కెట్ కమిటీ ఉనికి ప్రశ్నార్థకంగా మారింది. ఈ చట్టాల ప్రకారం మార్కెటింగ్ శాఖ ఆధ్వర్యంలోని చెక్‌పోస్టులను 2020–21 ఆర్థిక సంవత్సరంలో రద్దు చేశారు. దీంతో అప్పట్లో రాబడి గణనీయంగా పడిపోయింది. ఆ ఏడాది కందుకూరు ఏఎంసీకి ప్రభుత్వం రూ.1.65 కోట్లను లక్ష్యాన్ని విధించగా కేవలం రూ.63.65 లక్షల సెస్ మాత్రమే వసూలైంది. తర్వాత కేంద్రం రైతు చట్టాలను ఉపసంహరించుకోవడంతో తిరిగి ఏఎంసీ గాడిలో పడింది. 2021–22లో ప్రభుత్వం రూ.2.15 కోట్లు లక్ష్యం కాగా రూ.2.26 కోట్లు వచ్చాయి. రెండు సంవత్సరాల నుంచి వర్షాలు బాగా కురుస్తున్నాయి. దీంతో రైతులు అన్ని రకాల పంటలను సకాలంలో సాగు చేసుకుంటున్నారు. ఈ నేపథ్యంలో వ్యవసాయ ఉత్పత్తుల కొనుగోళ్లు కూడా పెరగడంతో మార్కెట్ సెస్ వసూళ్లు లక్ష్యానికి మించి ఉన్నట్లు అధికారులు అంచనా వేస్తున్నారు.

రూ.4 కోట్ల లక్ష్యాన్ని చేరుకునేందుకు కృషి



కందుకూరు వ్యవసాయ మార్కెట్ కమిటీ ప్రభుత్వం నిర్దేశించిన లక్ష్యానికి మించి మార్కెట్ ఫీజు వసూలు సాధించింది. రికార్డు స్థాయిలో రూ.4 కోట్ల లక్ష్యాన్ని చేరుకునేందుకు కృషి చేస్తున్నాం. జిల్లాలోనే మొదటి స్థానం సాధించడంలో ఏఎంసీ సిబ్బంది కష్టం ఎంతో ఉంది. వారికి అభినందనలు.

– శ్రీనివాసులు, ఏఎంసీ ఇన్‌చార్జి కార్యదర్శి

ఎమ్మెల్సీ బరిలో ఎవరో తేలింది

- అభ్యర్థులను ప్రకటించిన రిటర్నింగ్ అధికారి
- టీచర్ అభ్యర్థులు ఎనిమిది మంది
- గ్రాడ్యుయేట్ అభ్యర్థులు 22 మంది

చిత్తూరు కలెక్టరేట్ : ఉమ్మడి ప్రకాశం – నెల్లూరు – చిత్తూరు జిల్లాలకు సంబంధించి టీచర్, గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ ఎన్నికల బరిలో ఉండే అభ్యర్థులను కలెక్టర్, రిటర్నింగ్ అధికారి హరినారాయణన్ ప్రకటించారు. ఎన్నికల సంఘం నోటిఫికేషన్ ప్రకారం సోమవారం నామినేషన్ల ఉపసంహరణకు గడువు ముగిసింది. టీచర్ ఎమ్మెల్సీకి సంబంధించి వైఎస్సార్‌సీపీ తరఫున పర్వతరెడ్డి చంద్రశేఖర్‌రెడ్డి, పీడీఎఫ్ తరఫున పొక్కిరెడ్డి బాబురెడ్డి, బీజేపీ అనుబంధం ఆపస్ సంఘం నుంచి కుట్టుబోయిన బ్రహ్మానందం, రిటైర్డ్ టీచర్ శ్రీరామమూర్తి, ఇంకా పర్వతరెడ్డి ప్రవీణ, ధనంజయ శివయోగి, చిన రమణారెడ్డి లక్కు, అనసూయమ్మ లక్కు పోటీలో ఉన్నారు.

గ్రాడ్యుయేట్‌కు..

పట్టభద్రుల ఎమ్మెల్సీకి సంబంధించి మొత్తం 23 మంది నామినేషన్లు ఆమోదం పొందాయి. సోమవారం పేర్నాటి హేమ సుష్మిత నామినేషన్‌ను ఉపసంహరించుకున్నారు. దీంతో 22 మంది బరిలో నిలిచారు. వైఎస్సార్‌సీపీ తరఫున పేర్నాటి శ్యామ్‌ప్రసాద్‌రెడ్డి, టీడీపీ తరఫున కంచర్ల శ్రీకాంత్ చౌదరి, బీజేపీ నుంచి సన్నారెడ్డి దయాకర్‌రెడ్డి, ఇండిపెండెంట్లుగా బుస్సా రాజేంద్ర, కంచెర్ల సరిత, మట్టిగుంట కిరణ్ దాసరన్న, నీలం శామ్యూల్ మోజెస్, కామిశెట్టి భాస్కరరావు, బొట్టికాయల చంద్రశేఖర్, మాదాసి జలరావ్, పల్లిపట్టు అభినవ్ విష్ణు, మీగడ వెంకటేశ్వరరెడ్డి, పతంగి పాలంకరెడ్డి, వీరభద్రాచారి, దొడ్ల హరి, పూసల రవి, అంకయ్య చౌదరి, ఎస్.దినేష్, మహేంద్రరెడ్డి, కొమ్ము యోహాను, కరుణానిధి, గిరి జైపాల్ బరిలో ఉన్నారు.

రక్త సంబంధమనే కనికరం లేకుండా..

- అన్నదమ్ముల మధ్య ఆస్తి తగాదాలు
- తమ్ముడి మృతదేహాన్ని ఇంట్లోకి తీసుకురాకుండా అడ్డుకున్న అన్న
- పోలీసులను ఆశ్రయించిన కుటుంబసభ్యులు
- వారి చొరవతో సమసిన వివాదం



రోడ్డుపై పెరుమాళ్లు నాయుడు మృతదేహం

లింగసముద్రం: ఆస్తి తగాదాల నేపథ్యంలో తమ్ముడి మృతదేహాన్ని ఇంట్లోకి రానివ్వకుండా అన్న అడ్డుకున్నాడు. ఈ హృదయ విషాదక ఘటన మండలంలోని విశ్వనాథపురంలో సోమవారం ఉదయం జరిగింది. పోలీసులు, స్థానికుల కథనం మేరకు.. గ్రామానికి చెందిన పాడపాటి పెరుమాళ్లు నాయుడికి ఇద్దరు అన్నదమ్ములున్నారు. సుమారు 40 ఏళ్ల క్రితం ముగ్గురూ ఆస్తి పంచుకున్నారు. పెరుమాళ్లు నాయుడు కుటుంబసభ్యులు కర్ణాటక రాష్ట్రంలోని రాయచూర్ జిల్లాలో వ్యవసాయం చేసుకుంటూ అక్కడే ఉండేవారు. ఆయనకి అనారోగ్యంగా ఉండటంతో రెండు నెలల నుంచి భార్య సత్యవతితో కలిసి స్వగ్రామమైన విశ్వనాథపురంలో ఉన్న పాత ఇంట్లో ఉంటున్నాడు. రెండురోజుల క్రితం పెరుమాళ్లు నాయుడు ఆరోగ్యం క్షీణించడంతో కుమారులు ఒంగోలులో ప్రైవేటు వైద్యశాలలో చేర్పించారు. ఆదివారం రాత్రి ఆయన మృతి చెందాడు. మృతదేహాన్ని సోమవారం తెల్లవారుజామున విశ్వనాథపురంలోని ఇంటికి తీసుకురాగా పెరుమాళ్లనాయుడి అన్న పాపయ్య మృతదేహాన్ని ఇంట్లోకి తీసుకెళ్లేందుకు వీల్లేదని, గేటుకు తాళం వేసి ట్రాక్టర్ అడ్డుపెట్టాడు. ఈ సమయంలో పెరుమాళ్లు నాయుడు భార్య సత్యవతి ఇంట్లో ఉన్నారు. గేటుకి తాళం వేయడంతో ఆమె భర్త మృతదేహాన్ని చూసేందుకు వీలు లేకుండా పోవడంతో కన్నీరుమున్నీరైంది. ఈ విషయాన్ని మృతుడి కుటుంబసభ్యులు ఎస్సై అవుల వెంకటేశ్వర్లు దృష్టికి తీసుకెళ్లారు. ఎస్సై చొరవ తీసుకుని పాపయ్యతో మాట్లాడటంతో ఉదయం 10 గంటల తర్వాత మృతదేహాన్ని ఇంట్లోకి తీసుకెళ్లారు.

వీఆర్‌కు నవాబుపేట ఎస్సై

నెల్లూరు(క్రైమ్): విధుల్లో నిర్లక్ష్యం వహించడం, పోలీస్ శాఖ ప్రతిష్టను దిగజారుస్తున్న వారిపై ఎస్పీ సీహెచ్ విజయారావు కొరడా ఝుళిపిస్తున్నారు. అందులో భాగంగా ఇప్పటికే ఒక ఆర్ఐ, ఇద్దరు ఎస్సైలు, పలువురు సిబ్బందిపై చర్యలు తీసుకున్న విషయం తెలిసిందే. తాజాగా నైట్ బీట్‌లో నిర్లక్ష్యంగా వ్యవహరించారంటూ నవాబుపేట ఎస్సై శివప్రకాష్‌ను వీఆర్‌కు పంపుతూ ఆదేశాలిచ్చారు.

సమస్యల పరిష్కారానికి కృషి



చంద్రశేఖర్‌రెడ్డిని సన్మానిస్తున్న ఇంజినీరింగ్ కళాశాలల ప్రతినిధులు, అధ్యాపకులు

- ఉపాధ్యాయ ఎమ్మెల్సీ అభ్యర్థి చంద్రశేఖర్‌రెడ్డి

నెల్లూరు(టౌన్): ప్రైవేట్ విద్యాసంస్థల యాజమాన్యాలు ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని ఉమ్మడి ప్రకాశం – నెల్లూరు – చిత్తూరు జిల్లాల టీచర్ ఎమ్మెల్సీ అభ్యర్థి పర్వతరెడ్డి చంద్రశేఖర్‌రెడ్డి తెలిపారు. కనుపర్తిపాడులోని ప్రియదర్శిని, కోవూరులోని గీతాంజలి ఇంజినీరింగ్ కళాశాలల్లో సోమవారం పరిచయ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి ఉపాధ్యాయుడు గర్వపడేలా సేవలందిస్తానన్నారు. ప్రైవేట్ టీచర్లకు ఇళ్ల స్థలాలు, హెల్త్‌కార్డుల మంజూరుకు కృషి చేస్తాన్నారు. అనంతరం పర్వతరెడ్డి చంద్రశేఖర్‌రెడ్డిని కళాశాలల ప్రతినిధులు, అధ్యాపకులు ఘనంగా సత్కరించారు.

మద్దతు తెలిపిన ప్రభుత్వ ఉపాధ్యాయుల సంఘం

చంద్రశేఖరరెడ్డికి ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ ఉపాధ్యాయుల సంఘం సంపూర్ణ మద్దతు తెలుపుతోందని ఆ సంఘం అధ్యక్షుడు తిరుపాలు, ప్రధాన కార్యదర్శి తులసీదాస్ తెలిపారు. స్థానిక శివం హోటల్‌లో ఆ సంఘం సర్వసభ్య సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ చంద్రశేఖర్‌రెడ్డి సమస్యలను పరిష్కరిస్తారనే నమ్మకం తమకు ఉందని, రెడ్‌క్రాస్ ద్వారా అందించిన సేవలే ఇందుకు నిదర్శనమన్నారు. చంద్రశేఖర్‌రెడ్డి మాట్లాడుతూ ఉపాధ్యాయులు తొలి ప్రాధాన్యతా ఓటు వేసి తనను గెలిపించాలని కోరారు. సమావేశంలో వైఎస్సార్‌టీఎఫ్ రాష్ట్ర నాయకులు జాలిరెడ్డి, పీఆర్టీయూ అధ్యక్షుడు గిరిప్రసాద్, గిల్డ్ రాష్ట్ర అధ్యక్షుడు చిన్నప్ప, పీడీ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు పిచ్చిరెడ్డి, ఎస్ఏల్‌టీఏ అధ్యక్షుడు కొండయ్య తదితరులు పాల్గొన్నారు.

పోలీసుల అదుపులో హత్య కేసు నిందితులు?

నెల్లూరు(క్రైమ్): పాతకక్షల నేపథ్యంలో ఓ యువకుడిని దారుణంగా హత్య చేసిన కేసులో నిందితులను పోలీసులు అదుపులోకి తీసుకున్నట్లు సమాచారం. వివరాలిలా ఉన్నాయి. ఉడ్‌హౌస్ సంఘంలోని మహాలక్ష్మమ్మ దేవస్థానం వద్ద ఈనెల 24వ తేదీన మహేష్ అనే యువకుడు హత్యకు గురైన విషయం తెలిసిందే. నవాబుపేట పోలీసులు సీసీ కెమెరా ఫుటేజీ ఆధారంగా నిందితులను గుర్తించారు. హత్య చేయక ముందు నిందితులు ఓ బార్‌లో మద్యం తాగి అక్కడే పథక రచన చేసినట్లు ఆధారాలు లభ్యమయ్యాయి. దీంతో వారి కోసం గాలింపు చర్యలు చేపట్టారు. ప్రధాన నిందితుడితోపాటు అందరినీ పోలీసులు అదుపులోకి తీసుకున్నట్లు తెలిసింది. వారిని విచారించే క్రమంలో మరో వ్యక్తి పేరు వెలుగులోకి రావడంతో అతడిని కూడా పట్టుకున్నట్లు సమాచారం. నేడో, రేపో అరెస్ట్ చూపించే అవకాశం ఉన్నట్లు తెలుస్తోంది. సోమవారం సాయంత్రం నిందితులను ఏఎస్పీ డి.హిమవతి విచారించారు. హత్యకు దారి తీసిన పరిస్థితులను అడిగి తెలుసుకున్నారు.

మరో కేసులో..

నెల్లూరు నగరంలో సంచలనం రేకెత్తించిన హత్య కేసులో నిందితుడిని పోలీసులు అదుపులోకి తీసుకుని విచారిస్తున్నట్లు తెలిసింది. వివరాలిలా ఉన్నాయి. బుజబుజ నెల్లూరుకు చెందిన అనుదీప్ (30) అనే వ్యక్తిని ఈనెల 22వ తేదీన అతని స్నేహితుడు సురేష్ గొంతుకోసి దారుణంగా హత్య చేయగా పోలీసులు కేసు నమోదు చేశారు. ఈ ఘటనపై వేదాయపాళెం ఇన్‌స్పెక్టర్ నరసింహారావు ప్రత్యేక బృందాలను ఏర్పాటుచేసి పరారీలో ఉన్ననిందితుడి కోసం గాలింపు చర్యలు చేపట్టారు. నిందితుడు రోజుకో ఊరు తిరుగుతూ పోలీసులకు చిక్కకుండా తప్పించుకున్నాడు. ఈ నేపథ్యంలో అతడి బంధువులు, కుటుంబసభ్యు లు, స్నేహితుల ద్వారా పక్కా సమాచారం సేకరించిన ప్రత్యేక బృందం సోమవారం అదుపులోకి తీసుకున్నట్లు తెలిసింది.

తండల్ వ్యాపారి వేధింపులు తాళలేక..

- రైలు కింద పడి వ్యక్తి ఆత్మహత్య

నెల్లూరు(క్రైమ్): తండల్ వ్యాపారి దూషణలు, వేధింపులు తాళలేక ఆత్మహత్య చేసుకుంటున్నానని ఓ ఆటో డ్రైవర్ సూసైడ్ నోట్ రాశాడు. అనంతరం రైలు కింద పడి బలవన్మరణానికి పాల్పడ్డాడు. ఈ ఘటన వెంకటేశ్వరపురం ఫ్లై ఓవర్ కింద చెన్నై వైపు వెళ్లే రైలుపట్టాలపై జరగ్గా సోమవారం వెలుగు చూసింది. రైల్వే పోలీసుల కథనం మేరకు.. వెంకటేశ్వరపురం జనార్దనరెడ్డి కాలనీలో ఎ.ఏసుదాస్ (53), సుజాత దంపతులు నివాసం ఉంటున్నారు. వారికి ఇద్దరు కుమార్తెలు, ఒక కుమారుడు. వివాహమై వేరేచోట జీవిస్తున్నారు. కాగా ఏసుదాస్ ఆటో నడుపుతుంటాడు. వ్యక్తిగత అవసరాల నిమిత్తం సంతపేట ఉప్పరపాళెంకి చెందిన తండల్ వ్యాపారి కామాక్షమ్మ వద్ద రూ.37 వేలు అప్పు తీసుకున్నాడు. రోజూ తండల్ డబ్బు చెల్లించేవాడు. ఆర్థిక ఇబ్బందుల దృష్ట్యా వారంరోజులుగా కట్టలేదు. దీంతో ఇటీవల ఆమె ఏటీఎం కాంపౌండ్ వద్ద ఏసుదాస్‌ను అతని బంధువుల ఎదుట దుర్భాషలాడింది. వచ్చేనెల 5వ తేదీన చెల్లిస్తానని చెప్పడంతో వెళ్లిపోయింది. అయినా ఆమె వేధింపులు ఆగలేదు. దీంతో ఏసుదాస్ తీవ్ర మనస్తాపానికి గురయ్యాడు. శనివారం సాయంత్రం ఆరుగంటల ప్రాంతంలో వెంకటేశ్వరపురం ఫ్లై ఓవర్ వద్ద రైలు కింద పడి ఆత్మహత్య చేసుకున్నాడు. సోమవారం తెల్లవారుజామున నెల్లూరు రైల్వే పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని పరిశీలించారు. మృతుడి వద్ద సూసైడ్ నోట్, ఆధార్‌కార్డు లభ్యమైంది. 'నా అవసరాల నిమిత్తం ఉప్పరపాళెంకి చెందిన కామాక్షి వద్ద తండల్‌కు డబ్బు తీసుకున్నా. ఆమె దూషణలు, వేధింపులు తాళలేక ఆత్మహత్య చేసుకుంటున్నా.' అని నోట్‌లో (ఆటో పార్కింగ్ స్లిప్ వెనుక) రాసి ఉండటంతో రైల్వే పోలీసులు కామాక్షమ్మను అదుపులోకి తీసుకుని విచారిస్తున్నారు. మృతదేహానికి ప్రభుత్వ వైద్యులు పోస్టుమార్టం చేసి కుటుంబసభ్యులకు అప్పగించారు. రైల్వే పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

ఇద్దరు వ్యక్తులపై దాడి

నెల్లూరు(క్రైమ్): సెల్‌ఫోన్‌లోని మెమరీ కార్డు ఎక్కడని ప్రశ్నించిన ఓ వ్యక్తిపై, అతడి బావపై కొందరు దాడి చేసి గాయపరిచారు. పోలీసుల కథనం మేరకు.. ఉస్మాన్ సాహెబ్‌పేట చిన్న మహాలక్ష్మమ్మగుడి సమీపంలో మణి శివ నివాసం ఉంటున్నాడు. అతను నగదు కోసం తన సెల్‌ఫోన్‌ను అదే ప్రాంతానికి చెందిన అనిల్, చందు వద్ద రూ.2,000 తాకట్టు పెట్టాడు. ఇటీవల నగదు చెల్లించి ఫోన్ తీసుకున్నాడు. అయితే మెమరీ కార్డు లేకపోవడంతో వారిని ఆదివారం రాత్రి నిలదీశాడు. దీంతో కోపోద్రిక్తులైన అనిల్, చందు, ధన మరో ఇద్దరు కలిసి మణి శివపై దాడి చేశారు. అడ్డుకునేందుకు యత్నించిన అతడి బావ రాజాను సైతం కత్తితో దాడి చేశారు. బాధితుడు సోమవారం రాత్రి నవాబుపేట పోలీసులకు ఫిర్యాదు చేశాడు.

నిమ్మ ధరలు (కిలో)



పెద్దవి	: రూ.70
సన్నవి	: రూ.60
పండ్లు	: రూ.30

నెల్లూరు పౌల్ట్రీ అసోసియేషన్ ధరలు



బ్రాయిలర్ (లైవ్)	: 92
లేయర్ (లైవ్)	: 75
బ్రాయిలర్ చికెన్	: 170
బ్రాయిలర్ స్కిన్‌లెస్	: 190
లేయర్ చికెన్	: 128